క్లుప్తంగా

బీజేపీలో చేరిన రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాకు చెందిన రిటైర్డ్ పోలీస్ అధికారి, ఆదివాసీ నాయకుడు సెడ్మకి గోద్రూ బీజేపీలో చేరారు. హైదరాబాదులో శుక్రవారం కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆయనకు కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఇచ్చోడ: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆగస్టు 1న నిర్వహించే అన్నాభావు సాఠే జయంతిని జయప్రదం చేయాలని మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు గాయక్వాడ్ తులిసీదాస్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మాంగ్ కులస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు పరుశురాం, విఠల్, సంజయ్, సుభాష్ పాల్గొన్నారు.

'డివిజన్ కోసం రాజీనామా చేయండి'

బోథ్: బోథ్ డివిజన్ ఏర్పాటు కోసం ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలని బోథ్ సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం సర్పంచ్ సురేందర్, జెడ్పీటీసీ సంధ్యారాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు తాహెర్ బిన్ సలాం, ఉప సర్పంచ్ కట్ట పల్లవి భూమేశ్‌ల ఇంటికి వెళ్లి ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. ఎమ్మెల్యేపై ఒత్తిడి తెచ్చి డివిజన్ ఏర్పాటు చేయించాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోథ్‌లోనే ఏర్పాటు చేసేలా ఒత్తిడి తేవాలన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించడం తగదు

బజార్‌హత్నూర్: ఇచ్చోడ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేసిన బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును బీజేపీ, కాంగ్రెస్ నాయకులు విమర్శించడం తగదని టీఆర్ఎస్ మండల కన్వీనర్ కానిందే రాజారాం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. బోథ్ పట్టణంలో ఎమ్మెల్యే దిష్టి బొమ్మను దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పరచ సాయన్న, చంద్రశేఖర్, సాయి చైతన్య, మహబూబ్, లక్ష్మణ్, పోతన్న, ప్రకాష్, తులసిరాం, నరేశ్, జగదీష్ పాల్గొన్నారు.

ఆర్టీసీని కాపాడాలి

ఉట్నూర్‌రూరల్: టీఎస్ ఆర్టీసీని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్కారంలో గల రాంజీగోండ్ భవన్‌లో సేవ్ ఆర్టీసీ అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా జిల్లా కార్యదర్శి నంది రామయ్య, చారులత, పెందూర్ ప్రభాకర్, ఆత్రం భుజంగ్‌రావు, నందు, అరవింద్, రామారావు, జగన్‌సింగ్, హరిప్రసాద్, వినయ్‌కుమార్, శ్యాం, సంజీవ్‌లు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్

గుడిహత్నూర్: ఆదిలాబాద్ నుంచి ఉట్నూర్ మార్గంలో నడుస్తున్న ఆర్టీసీ బస్ ఉట్నూర్ ఎక్స్ రోడ్డు సమీపంలో మొరాయించింది. ఇంతకీ స్టార్ట్ కాకపోవడంతో డ్రైవర్, కండక్టర్లు విశ్వప్రయత్నం చేశారు. బస్ గంట పాటు నిలిచి ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఎట్టకేలకు బస్ స్టార్ట్ కావడంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు బయలుదేరి వెళ్లారు.

నాందేవ్ కాంబ్లే వర్ధంతి

ఆదిలాబాద్‌రూరల్: డీసీసీబీ మాజీ అధ్యక్షుడు దివంగత నేత నాందేవ్ కాంబ్లే వర్ధంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో అన్నాభావు సాఠే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యక్షుడు సూర్యకాంత్, అంబేద్కర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దుర్గం శేఖర్, రత్నజాడే ప్రజ్ఞాకుమార్, నాందేవ్, మాధవ్, రాజీకుమార్, అల్లూరి రాంరెడ్డి, రామోజీవార్ అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర నిధులను మళ్లిస్తున్న కేసీఆర్'

సిరికొండ: సీఎం కేసీఆర్ వంతెనలు, రోడ్లకు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వ నిధులను మళ్లిస్తుందని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఆరోపించారు. శుక్రవారం మండలంలో పర్యటించారు. వరదలో కొట్టుకుపోయిన కోండపూర్ వంతెనను పరిశీలించారు. ఈవంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినా.. రాష్ట్ర ప్రభుత్వం వేరే పనులకు వాడుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమోల్, రఘురాం, పెందుర్ అమృత్‌రావు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి

ఇంద్రవెల్లి: కోతకు గురైన రోడ్లు, కల్వర్టులకు మరమ్మత్తులు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ త్రివేణి సంఘం చెరువు, దెబ్బతిన్న రహదారి, పిట్టబోంగరంలో కోతకు గురైన రోడ్లు, వంతెనలను పరిశీలించారు. జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, సిడాం భీంరావ్, దీపక్‌సింగ్‌షెకవత్, మరప రాజు, రాజలింగు, భీంరావ్ పాల్గొన్నారు.

తగ్గని వరద



నేరడిగొండ: వడూర్‌లో పొలాల్లోకి కొట్టుకువచ్చిన రాళ్లు

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- బాహ్యప్రపంచానికి పలు గ్రామాలు దూరం
- పంటపొలాల్లో మట్టిదిబ్బలు

ఉట్నూర్‌రూరల్: ఏకధాటిగా వర్షం కురవడంతో ఏజెన్సీ గ్రామాల్లో వరద ఉధృతి ఇంకా తగ్గముఖం పట్టలేదు. మండల కేంద్రానికి చేరుకోవాలంటే వాగులు, వంకలు దాటాల్సిన పరిస్థితి. వాగులు ఉధృతంగా ప్రవహించడంతో జనజీవనం స్తంభించింది. ఉట్నూర్ ఐబీ ప్రాంతం జలమయమైంది.. రోడ్లు దెబ్బతిన్నాయి. దుకాణ సముదాయాల్లోకి వరద నీరు చేరింది.

నేరడిగొండ: భారీ వర్షాలకు మండలంలో పంటలు దెబ్బతిన్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. రాళ్లు, రప్పలు కొట్టుకొచ్చాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కుప్టి, కుమారి, తర్నం, వాగ్దారి, మాధాపూర్, కుంటాల(కె), కుంటాల(బి), వడూర్, బోరిగాం, పాషాతండా, వాంకిడి, కొర్టికల్, తేజాపూర్, బుద్ధికొండ గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నార్నూర్: వాగులు, కల్వర్టులపై నుంచి వరదనీరు పొంగి పొర్లుతుండడంతో రాకపోకలు నిలిచిపోయింది. శుక్రవారం గాదిగూడ మండలంలోని ఖడ్కి గ్రామం దగ్గర కల్వర్టుపై నుంచి వరద నీరు పారడంతో రాకపోకలు స్తంభించాయి. డాబా(కె), లోకారి(కె) కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. బారిక్‌రావుగూడకు రాకపోకలు బంద్ అయ్యాయి. గాదిగూడ మండలంలోని కునికాసా కొలాంగూడ పరిస్థితి దారుణం. అర్జుని మారుగూడ వాగు పొంగిపొర్లడంతో దాదాపు 60 కుటుంబాలు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్నాయి.

ఇంద్రవెల్లి: మండలంలోని మామిడిగూడ, చిత్తబట్ట, జైత్రంతండా గ్రామాలు ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మామిడిగూడ గ్రామస్తులు చేతిలో కర్రలు పట్టుకొని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగు దాటుతున్నారు. చిత్తబట్ట గ్రామస్తులు సహితం వాగును తాడు సాయంతో దాటుతున్నారు. అత్యవసర సమయంలో వాహనాలు వెళ్లలేని పరిస్థితి.



ఇంద్రవెల్లి: చిత్తబట్టలో తాడు సాయంతో వాగు దాటుతున్న గిరిజనులు



ఉట్నూర్‌రూరల్: దుకాణాల్లోకి చేరిన వరద

కొట్టుకుపోయిన కల్వర్టు



బేల: మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలోని కరోని(బి) గ్రామ శివారులోని కల్వర్టు సీసీ రోడ్డు గురువారం రాత్రి కురిసిన వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

బేల: రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితులను తక్షణమే ఆదుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బెదోడ, గూడ, మణియార్‌పూర్, మాంగ్రుడ్, కొగ్దూర్ గ్రామాల్లో పర్యటించారు. వరద బాధితులతో మాట్లాడి, జరిగిన నష్టంపై ఆరా తీశారు. ఇళ్లలో నీరు చేరిన బాధిత కుటుంబానికి రూ.10 వేలు, పంటలు నష్టపోయిన బాధిత రైతులకు ఒక ఎకరాకు రూ.25 వేల ఆర్థికసాయం అందజేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, వెంకట్ రెడ్డి, వాంఖడే వామన్, ఘణేశ్యాం, గోడే అవినాష్, బొక్రే శంకర్, తాక్రే విపిన్ పాల్గొన్నారు.

నేరడిగొండ: ఇళ్లలోకి వరద నీరు చేరి నష్టపోయిన ప్రజలకు ఆదుకోవాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎండీ సద్దాం అన్నారు. శుక్రవారం తహసీల్దార్ పవన్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా చాలా కుటుంబాలకు నష్టం వాటిల్లిందన్నారు.



మాట్లాడుతున్న గండ్రత్ సుజాత, సాజిద్‌ఖాన్

నాసిరకం పనులతోనే రోడ్లు అధ్వానం

ఉట్నూర్‌రూరల్: నాసిరకం పనులతోనే రోడ్లు అధ్వానంగా మారాయని కాంగ్రెస్ నియోజక వర్గ నాయకులు పెందూర్ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని చాందూరి, కొత్తగూడ, కెస్లాగూడ, రాజులగూడలను సందర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే రేఖానాయక్ విఫలమైందని ఆరోపించారు. చాందూరి మాజీ సర్పంచ్ ఆత్రం రఘునాథ్, మంగం విశ్వంరావు, శేషు, రాహుల శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

పరిహారం అందించాలి

బోథ్: బోథ్ మండల వ్యాప్తంగా రెండు వేల ఎకరాల్లో పంట నీట మునిగిందని, ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో నీట మునిగిన పంటలను పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఆయన వెంట రైతులు మోహన్‌రెడ్డి, శేఖర్, భీమ్‌రావ్, లింగన్న, శంకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీవి అసత్య ఆరోపణలు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్, బీజేపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లోకారి గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన సవారీబంగ్లా షెడ్డునరు ప్రారంభించారు. పీరీలకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిపక్ష పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, రానున్న ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వస్తామన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ గండ్రత్ రమేశ్, డీసీసీబీ డైరెక్టర్ మెస్రం పరమేశ్వర్, కుమ్ర విజయలక్ష్మి రాజు, కిషన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ఆదివాసీ గ్రామాలు

జైనథ్: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ఆదివాసీ గ్రామాలు, గూడేలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండలంలోని సుందరగిరి, లంకుగూడ, మాంగుర్ల, మేడిగూడ, మార్గూడ, జామిని గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సవారీబంగ్లాల షెడ్డులను ప్రారంభించారు. పీరీలకు ప్రత్యేక పూజలు చేశారు.

అధైర్యపడవద్దు.. ఆదుకుంటాం..

వర్షాలకు నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని, ఎవరూ అధైర్యపడవద్దని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని మేడిగూడ గ్రామంలో వర్షానికి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డి, పెందూర్ దేవన్న, రోకండ్ల రమేశ్‌రావు పాల్గొన్నారు.



సవారీబంగ్లా షెడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వంతెనను పరిశీలించిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: భారీ వర్షాలతో కోతకు గురైన మండలంలోని అంకోలి సమీపంలోని వంతెనను ఎమ్మెల్యే జోగు రామన్న శుక్రవారం పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. కుంభవృష్టి వర్షాలు కురుస్తున్నందున అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సంక్షిప్తం..

వాయినాల సమర్పణ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డ్ కాలనీలో రామాలయంలో శ్రీసీతా సమేత రామచంద్ర మూర్తికి మహిళలు వాయినాలను సమర్పించారు. మహిళలు మాట్లాడుతూ అధిక మాసాన్ని పురస్కరించుకొని ప్రతిఒక్కరు అల్లుళ్లకు వాయినాలు ఇవ్వడం హైందవ సంస్కృతిలో భాగమన్నారు.

కాంగ్రెస్ మైనార్టీసెల్ చైర్మన్‌గా కలీమ్

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ మైనార్టీసెల్ చైర్మన్‌గా కలీమ్‌ను నియమిస్తూ రాష్ట్ర మైనార్టీ కమిటీ చైర్మన్ అబ్దుల్ల సోహెల్ గురువారం హైదరాబాద్‌లో నియామక పత్రం అందజేశారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫిర్యాదులు, సలహాలు, సూచనలు ఇచ్చేవారు 99592 26002 సంప్రదించాలని కోరారు.

ఎకరానికి రూ. 25 వేలు అందించాలి

జైనథ్: నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు నష్ట పరిహారం అందించాలని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మేడిగూడ గ్రామంలో పర్యటించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి, దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. సంతోశ్, షకీల్, భూమన్న, రవీందర్, దత్తు, తదితరులు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ బూర్నూర్ గ్రామంలో పర్యటించి, దెబ్బతిన్న పంటలు, కూలిన ఇళ్లను పరిశీలించారు. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఇచ్చోడ: వర్షాకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ముఖరా(కె) సర్పంచ్ గాడ్గే మీనాక్షి గ్రామస్తులకు సూచించారు. శుక్రవారం ప్రతీ ఇంటి ముందు బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఆమె వెంట ఎంపీటీసీ గాడ్గే సుభాష్, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం ఉన్నారు.

రోడ్లను పరిశీలించిన ఆర్డీవో

బోథ్: వర్షానికి దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులను ఆర్డీవో స్రవంతి శుక్రవారం పరిశీలించారు. బోథ్‌ను ఆనుకుని ఉన్న కంద్ర వాగుపై తాత్కాలికంగా నిర్మించిన వంతెన వాగు ఉధృతికి కొట్టుకుపోయింది. కాగా వంతెన నిర్మాణాన్ని త్వరగా నిర్మించేలా చూడాలని ఎంపీపీ తుల శ్రీనివాస్ కోరారు. కదం ప్రశాంత్, ఎంపీడీవో సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల మరమ్మతుకు సాయం

నేరడిగొండ: మండల కేంద్రంలోని సీసీ కెమెరాల మరమ్మతుకు ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు ఎస్సై సాయన్నకు రూ.11వేలను పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ ఆర్ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులను ఆదర్శంగా తీసుకొని దాతలు సీసీ కెమెరాల కోసం ముందుకు రావాలని కోరారు.

'ఎంపీ 'సోయం'ను విమర్శిస్తే ఊరుకోం'

ఇంద్రవెల్లి: ఆదివాసీ హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్‌ను లంబాడాలు విమర్శిస్తే ఊరుకోమని ఆదివాసీ సంఘాల నాయకులు ఆర్క ఖమ్ము, మెస్రం నాగ్‌నాథ్‌లు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో మాట్లాడారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజా, రాజకీయ, న్యాయ పోరాటం చేస్తుంటే కొందరు జీర్ణించుకోలేక అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మెస్రం జైరాం, తుమ్రం లక్ష్మణ్, మడావి బాదుపటేల్, ఆత్రం అశోక్, పెందోర్ మానిక్‌రావ్, సుదర్శన్ పాల్గొన్నారు.

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

ఇచ్చోడ: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావును లంబాడాలు విమర్శిస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు ఆదివాసీల పోరాటం కొనసాగుతుందన్నారు. ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలు చేస్తున్న పోరాటానికి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో తుడుందెబ్బ నాయకులు సిడాం మురళీకృష్ణ, మెస్రం దేవురావు, మడావి భీంరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఫలించిన పోరాటం

ఇచ్చోడ: ఆరేళ్ల సుదీర్ఘ పోరాటానికి ఫలితం దక్కిందని బీ సైన్ సంఘం అధ్యక్షుడు పెరమళ్ల స్వామి అన్నారు. ఇచ్చోడలో జనరల్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కళాశాల ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ఆర్గుల గణేశ్, బొజ్జ రవి, కల్లెం ప్రవీణ్‌రెడ్డి, జాకీర్, మచ్చ అజయ్, రాకేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

గుడిహత్నూర్: నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయించిన ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్‌కు బీఆర్ఎస్ మండల కన్వీనర్ కరాడ్ బ్రాహ్మనంద్ కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చోడ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, బోథ్, నేరడిగొండ మండలాల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని యేంద గ్రామంలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టి. దుర్గారాణి హాజరై గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చిన్న చిన్న గొడవలతో పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూ తిరిగి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. న్యాయవాదులు జైవంత్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

బోథ్: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని న్యాయవాదులు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బోథ్ మండలంలోని సొనాల, బజార్‌హత్నూర్, పిప్రి, ఇచ్చోడ, గుడిహత్నూర్ మండలాల్లో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగద్ కేంద్రే, విజయ్ కుమార్, కోర్టు సిబ్బంది స్రవంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

- ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

తలమడుగు: రైతులు అధైర్యపడొద్దని ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సకినాపూర్ గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను శుక్రవారం పరిశీలించారు. ధైర్యంగా ఉండాలన్నారు. మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బోథ్ అధికార ప్రతినిధి మొట్టే కిరణ్ కుమార్, మండల కన్వీనర్ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

రహదారులను పునరుద్ధరించాలి

గుడిహత్నూర్: దెబ్బతిన్న రహదారులను వెంటనే పునరుద్ధరించాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని టాకీగూడ కల్వర్టును పరిశీలించారు. రెండున్నర కోట్లతో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, శాశ్వత పరిష్కారం చూపుతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. సీతాగోంది, మన్నూర్, గుడిహత్నూర్ వాగు పరీవాహక ప్రాంతాల ప్రజలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సంధ్యారాణికి సూచించారు. జేతు కుందన్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ బ్రహ్మానంద్, ఎంపీడీవో సునీత, ఎంపీవో లింగయ్య, షగీర్‌ఖాన్, సర్పంచ్ దస్రు పాల్గొన్నారు.




పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాపురావు

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

తాంసి: మత సామరస్యానికి ప్రతీక మొహర్రం పండుగని నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి, తాంసి మండలంలోని కప్పర్ల మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. పీరీలకు ప్రత్యేక పూజలు చేశారు. భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్, అఫ్రోజ్, శ్రీకాంత్ రెడ్డి, రజనీకాంత్ రెడ్డి, తిరుమల్ గౌడ్, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామంలోని హస్సేన్ హుస్సేన్ దేవస్థానాన్ని శుక్రవారం నేరగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ పోతారెడ్డి, తిరుమల గౌడ్, మోతే శ్రీనివాస్ ఉన్నారు.

- మొహర్రం సందర్భంగా అనేక గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. శుక్రవారం ఉండం గ్రామంలో గల మూడు హస్సేన్ హుస్సేన్ దేవస్థానాలను బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు దర్శించుకున్నారు. ఆయన వెంట మండల కన్వీనర్ వెంకటేశ్, నాయకులు ఉన్నారు.



పూజలు చేస్తున్న జెడ్పీటీసీ తాటిపెల్లి రాజు

పీరీల ఊరేగింపు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఎక్స్‌రోడ్డు, హస్నాపూర్, శ్యాంపూర్, లక్కారం గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా గ్రామాల్లో పీరీలను ఊరేగించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నార్నూర్: మారుమూల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. శుక్రవారం నార్నూర్, గాదిగూడ మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో సీఐ ప్రేంకుమార్‌తో కలిసి పర్యటించారు. మల్లెంగి పరిధిలోని బారిక్‌రావుగూడ, ఉమ్రీ పరిధిలోని చిత్తగూడ, గాదిగూడ మండలాల వాగులను పరిశీలించారు. వాగుల వరద ఉధృతి తగ్గకపోవడంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. ఆయన వెంట ఎస్సై రవికిరణ్, మహేశ్, గ్రామస్తులు జైవంతరావు, అర్జున్, భీంరావు, జాదవ్ సంతోశ్ ఉన్నారు.

వాగులు దాటే ప్రయత్నం చేయవద్దు

ఇంద్రవెల్లి: ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఈశ్వర్‌నగర్, వడగాం, ముత్నూర్, దస్నాపూర్, దేవాపూర్, శంకర్‌గూడ, తాటిగూడ గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలు, కొట్టుకుపోయిన రోడ్లను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి రోడ్లను మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఎంపీపీ పోటే శోభాబాయి, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, జాదవ్ శ్రీరాంనాయక్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వంతెన పరిశీలన

సిరికొండ: మండలంలోని కోండపూర్ గ్రామంలోని చిక్‌మాన్ వాగుపై వంతెన వరద ఉధృతికి కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డును ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ శుక్రవారం పరిశీలించారు. త్వరలోనే పనులు ప్రారంభించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతామన్నారు.

నిండుకుండలా మత్తడిగూడ చెరువు

ఉట్నూర్‌రూరల్: ఏకదాటి వర్షాలతో మండలంలోని మత్తడిగూడ చెరువు నిండుకుండలా ఆకట్టుకుంటుంది. శుక్రవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు మత్తడి చెరువు వద్దకి చేరుకొని అందాలను తిలకించారు. చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చేపల వేట



ఉట్నూర్‌రూరల్: వర్షాలకు చెరువులు, కుంటలు, వాగులు పొంగి పొర్లుతుండడంతో ప్రజలు చేపల వేటలో నిమగ్నమయ్యారు. శుక్రవారం మత్తడి చెరువు వద్ద మహిళలు దోమతెరలతో చేపలు పట్టారు.